# ఆ డ మ ళ యా ళం

"గోపీ"

"వస్తున్నా" అన్నాడు గదిలోనుంచి.

"ఇంకెంతసేపు? కారువచ్చి గంటసేపయింది. అబ్బా పురుషులకున్న రోగమే ఇది. సింగారం....సింగారం....సింగారం....రోజంతా సింగారమే! పని తొందరా తెలియదు, పాడూ తెలియదు, గోపీ—గోపీ"

క్రాపు దువ్వుకునేటప్పటికి ఇంకోలక్ష. "కొంచెంసేపు ఆగలేవా?" అన్నాడు గదిలోనుంచి బయటికివస్తూ.

"ఆగలేను గోపీ. నీ అపూర్వ సౌందర్యం నన్ను తనలోనికి గుంజుకుంటోంది. నీవు లేనప్పుడు నే ననుభవించే విరహబాధ నన్ను భయపెడుతోంది గోపీ, గోపీ, నీ సౌందర్యం నీకుతెలియదు. కాని సౌందర్యం పురుషులు మెచ్చుకోలేరు. కాని...."

"చాల్లే, ఊరుకో"

ఎలిజా ముందు తా నొక స్త్రీనయి పోతున్నానని చీకాకు పడ్డాడు.

"ఊరుకోలేను గోపీ!"

"ఊరుకోవాలి ఎలిజా!"

"స్త్రీ హృదయ తంత్రులు అతి సున్నితమైనవి."

సీరియస్‌గా మొదలు పెట్టింది ఎలిజా. "అవి గాలి అలల రాపిడికే ప్రతిధ్వనిస్తాయి. కనుక దేనినీ ఓర్చుకొని ఊరుకోలేదామె."

గోపీ ఎలిజా కన్నులలోకి నవ్వి "పద పోదాము" అన్నాడు.

"ఆలస్యమైంది, కారెక్కిపోదాం."

"కారు నాగరిక ఘోషాపద్ధతి. సౌందర్యవతులకు కారెందుకు? టిక్ టాక్ మంటూ బజారువెంట నడిచిరాక" అన్నాడు గోపీ.

"నేనయితే అంతే చేసేదాన్ని, కాని పురుషపుంగవుడవు నీవున్నావుగా! నీ కోసమే కారు తెప్పించాను వీధులలో తిరిగితే నీకు తప్పక దిష్టి తగులుతుంది. మళయాళీ స్త్రీల చూపులు పురుషుల అందాన్ని తమలోకి పీల్చుకుంటాయి. అమ్మో! నా గోపీని కారు లేకుండా పదిమందిచూపుల్లో పడేటట్లు నడిపిస్తానా నేను."

ఇద్దరూ కారు సమీపించారు. ఎలిజా డ్రైవరు సీటులో కూర్చుంది. ఆమె ప్రక్కనే కూర్చున్నాడు గోపీ, కారు బయలు దేరింది.

"రాజుగారు జన్మిస్తే ఈరాద్ధాంత మెందుకు? జన్మించడం అనే ఘనకార్యం చేశాడనా? పోనీ మీ రాజుగారు జన్మించినందుకు మీరు సంతోషపడాలిగాని, మధ్య నా కెందుకు? నన్ను అనవసరంగా బయలుదేరదీశావు ఎలిజా. ఆ వస్తుప్రదర్శనశాలకు నేనెందుకు చెప్పూ.... చెప్పూ?"

"వస్తు ప్రదర్శనశాలంటే ఏమనుకున్నావు?"

"వస్తు....ప్రదర్శన....శాల అనుకున్నాను." అన్నాడు ముసిముసి నవ్వులతో.

"పిచ్చితండ్రి, అక్కడే నీవు పొరపాటు పడ్డావు. వస్తు ప్రదర్శనశాలంటే మళయాళంలోని స్త్రీ ప్రదర్శనశాల అన్నమాట. ఈ పట్టణంలోని సుందరాంగులందరూ అక్కడే వుంటారు. సరుకులు అమ్మేవారు, కొనేవారు, అందరూ స్త్రీలే! అటువంటి ఆనంద మందిరానికి నిన్నిపుడు తీసుకొని పోతున్నాను" అన్నది ఒకచేత్తో కారు నడుపుతూ, రెండో చేత్తో హారన్ వూదుతూ.

"ఆ సౌందర్యరాశిలోకి నే నెందుకు?"

"నా కోసం."

మొహం చిట్లించి, "నీ కోసం నే నెందుకు?"

"తెలితారలకు వెలుగెందుకు? తలిరుపూవులకు తావి ఎందుకు? నీవు నాకందుకు."

"ఎలిజా! నీవు మళయాళం మాట్లాడుతున్నావు."
"మహాశయా సుతారంగా తప్పించుకున్నారు."

ఇద్దరూ ఒకరిని చూచి ఒకరు నవ్వుకున్నారు. కారు దారితప్పింది.

ఆ స్త్రీలను చూచి గోపీ అదే స్వర్గ మనుకున్నాడు. ఆ సౌందర్యమును చూచి ముగ్ధుడైపోయినాడు....ఎలీజా అతనిని ఆ ప్రదర్శశాలలోని ప్రతిషాపూ తిప్పింది. ఇద్దరూకలిసి కొన్ని వస్తువులు కొన్నారు. ఎలిజా కోటుగుడ్డా, షర్టుగుడ్డా, మరికొన్ని కొన్నది. గోపీ ఒక చీరె, జాకెట్టూ కొన్నాడు.

"గోపీ, ఆ చీరె, జాకెట్టు నీకు బాగుంటాయి ఏదీ ఆలోచించనియ్యి ఆ జాకెట్టు తొడుక్కొని, ఆ చీరె కట్టుకొని_ఆహా గోపీ,ఎంత మనోహరంగా ఉంటావు!"

గోపీకి యేమీ తోచక, "తమరు షర్టు తొడిగి కోటు వేసుకున్న దానికంటే బాగానే వుంటాను. మళయాళ స్త్రీల గూడకట్టు కంటె నాకి చీరె అనేకరెట్లు బాగుంటుంది. తమరేమీ చెప్పనక్కరలేదు." అన్నాడు.

"అబ్బా, ఇంతలో ఉరుములు, ఇంతలో మెరుపులు. నీతో నేను వేగలేను గోపీ ఇప్పుడు నే నన్నదానిలో తప్పేమున్నది? ఈ చీరె నీకు పసందుగా వుంటుంది అన్నాను. ఎర్రనివాళ్ళు నల్లచీరె కట్టుకుంటే మేఘావృతమైన చంద్ర బింబం లాగుంటారు. ఆ సంగతి నీకూ తెలుసు లేకపోతే ఇంతడబ్బు తగలవేసి ఆ చీరె ఎందుకు కొంటావు? ఆహా, ఈచీరె నీ కెంత బాగుంటుంది. నీకు కోపంవచ్చినా,రాకపోయినా బాగానేవుంటుంది.

ఇంకా నామాటలు నమ్మకపోతే ఆ అమ్మాయిని అడుగుదాం.... 'జేన్, ఇల్లారా?' అని ప్రక్క బట్టలషాపులో బేరంచేస్తున్న ఒక యువతిని పిలిచి గోపీ చేతిలోని చీరెను లాగి ఆమెకు చూపుతూ "చీరె ఈయనకు అందంగా వుండదా జేన్?" అన్నది.

ఆమె ఆ చీరెను చూచి, గోపీని నఖశిఖ పర్యంతము చూచి, అద్భుతంగా వుంటుంది. నేత్రానందంగా వుంటుంది. మనోరంజకంగా వుంటుంది." అన్నది.

గోపీ, జేన్ చూపులను భరించలేక, తలవాల్చి క్రిందకు చూస్తూకాలి బొటనవ్రేలిని భూమిలోకి గుచ్చుకున్నాడు.

"గోపీ. సిగ్గుపడకు. యదార్థమది" అని అన్నది లాలనగా.

"ఈ పురుషులకు సౌందర్యంకొద్దీ సిగ్గు" అని బుగ్గ పోటు పొడిచి క్రీగంట చూస్తూ వెళ్ళింది. జేన్.

"గోపీ, ఇటుచూడు—ఏదీ ఒక్కసారి చూద్దూ! ఎంత చదువుకున్నా మీ జాతికి సిగ్గుపోదుగదా, పోదాంరా" అని చేయిపట్టుకుంది.

జేవురించిన మొహం పైకెత్తి "ఎక్కడికి? ఇంటికేనా" అని అడిగాడు.

"ఏమంత తొందర? ఆనందమును భరించ లేనంత దుర్బలుడవు గాదే నీవు. అనుభవించవలసిన దంతా ముందున్నదోయి? ఇప్పుడే నీరస పడిపోకు."

"ఎలిజా, ఈ ఆనందం చాలు నాకు. మహాతల్లీ, నన్నిలా బ్రతుక నివ్వు."

"ప్రాధేయపడేవారిని చూస్తే స్త్రీకి పెత్తనం చేయబుద్ధి అవుతుంది. ఎవరి యిష్టం వారిది. నీకు సంతోషమును ప్రసాదించే పనులు

చేయడం నావంతు; వాటివల్ల సుఖమును పొందడం నీవంతు. కనుక టీతీసుకుందాం రా" అని గోపీ చేయిపట్టుకుంది.

"చిత్తము చిత్తము, చేయి వదిలివేయండి. వస్తాను" అన్నాడు అతడు.

ఆ స్వర్గంలో అది నందనోద్యానం. అది 'మధుర వేణు' వీణాగాన మండితం' అది 'వికచ మందార పుష్పమరంద గురు ఝురీప్లావితం' అప్సరసలవంటి స్త్రీలున్నా రందులో "గోపీ, ఎక్కడ కూర్చుందాం?" అన్నది ఎలిజా.

"ఎక్కడయినా సరే."

"అదీ తెలివి, ఎక్కడో కూర్చుని ఇంతకాఫీ గొంతులో పోసుకుంటే సరిపోతుందా? అయితే ఇంతదూర మెందుకూ? ఇంటివద్దే ఆ పని పూర్తిచేసుకోవచ్చే! అదిగో ఆబల్లదగ్గరచూడు! ఆ అమ్మాయి సౌందర్యం ఆ అమ్మాయి చేతికాఫీ మిగిలినవాళ్ళు యిచ్చే కాఫీ ఒకేలాగుంటుందా? అక్కడకు పోదాం రా?"

గోపీ మాట్లాడకుండా ఆమె అడుగుల్లో అడుగులు వేస్తూ వెళ్ళాడు. ఆ గదిలోని స్త్రీలందరూ తన్ను వింతగా చూస్తున్నట్లు తెలిసికొన్నప్పుడు అతని అడుగులు తడబడ్డాయి. నెమ్మదిగా ఎలిజా ప్రక్కనున్న కుర్చీలో జారాడు.

"ఏమి కావాలో చెప్పు" అన్నది ఎలిజా.

"టీ తీసుకొని రండి" అన్నాడు గోపీ తనను చూస్తూ నిలబడిన ఆ సౌందర్యవతితో.

" మాయిద్దరికి బ్రెడ్డూ, బట్టర్ తీసుకొని రండి" అన్నది ఎలిజా.

"నాకు అక్కరలేదండి. ఎవరి ఇష్టము వచ్చింది వారికి తీసుకొని రండి."

మారాముచేసే పిల్లవానిని మందలించే తల్లివలే, "గోపీ!" అన్నది ఎలిజా.

"పాపం వారిని బలవంత పెట్టకండి. పురుషులను మనం పువ్వుల వలె వాడుకోవాలి వారు సుకుమారులు" అన్నదా అమ్మాయి గోపీ బిక్క మొహం చూచి.

"మరేమీ పరవాలేదు. జాలితలచకు. నీ కెంత హక్కున్నదో–బల వంత పెట్టుటకు–నాకంత హక్కున్నది" అన్నది ఎలిజా నవ్వుతూ

"అదా సంగతి!" అని అర్థము చేసుకున్నట్లు నవ్వి బ్రెడ్డు తీసుకొని రావటానికి పోయింది.

"గోపీ! చూశావా, ఆ అమ్మాయి సౌందర్యం!"

"స్త్రీలకు సౌందర్యంవుంటుందా! అది ప్రకృతివిరుద్ధం. స్త్రీలల్లో సౌకుమార్యపు నీడలు చూచి సౌందర్యమని భ్రమపడతారు. కొందరు. అసలు సౌందర్యం పురుషులదే" అన్నాడు గోపీ.

ఆ సమయంలోనే ఆమె చెరియొక ప్లేట్‌లో బ్రెడ్డు తెచ్చి వారి ముందు ఉంచింది. ఎలిజా గోపీని చూపుతూ "చూశారా వీరేమంటున్నారో? మీరు సౌందర్యవతులుకారట. మీ సౌకుమార్యపు వెలుగు నీడలుచూచి కొందరు సౌందర్యమని భ్రమపడుతున్నారట!"

గోపీ నోటిలో ఉంచుకోబోయిన బ్రెడ్డుముక్కను అలా చేత్తో పట్టుకుని నిర్ఘాంతపడి చూశాడు.

"పోనీలెండి. పురుషులకు అంతవరకయినా తెలిసింది. అసలు సౌందర్యమనేది ప్రపంచంలో లేదని వాళ్ళ కింకా తెలియదు పాపం! నిన్న గాక మొన్ననేగా వాళ్ళ కళ్ళు తెరిచింది. అందులో ఈయన మరీ వింతగా వున్నాడు" అన్నదా అమ్మాయి.

గోపీ హృదయం చీమల పుట్టవలె గులగులలాడింది స్వర్గములో, కిలకిల నవ్వులతో, పుష్పొడి పూతలలో, అప్సరసల చేతులలో వున్న మానవునివలె, అశోకవనంలో రాక్షసులమధ్య రద్దీ రవ్వ సహించలేక విల పిస్తున్న చిక్కువడిన కేశముల సీతమ్మవారివలె, సతుల మాయలువన్ని, పొలిండ్లు పొంగారించుకొని, పై అంచులు మోవగ అధరం బాసించిన వరూధిని చేతులలో బడ్డ ప్రవరాఖ్యునివలె, వెతజెందాడు. వాళ్ళిద్దరూ అతని అవస్థ చూచి పతివ్రతలను చూచి, అపహాస్యముచేసే రసికులవలె నవ్వారు.

టీ త్రాగి ఇద్దరూ బయలుదేరారు. ప్రదర్శనశాలను దాటి కారు వైపుకు నడుస్తున్నారు.

"గోపీ, ఎట్లావున్నదీ ప్రదర్శనశాల?" అన్నది ఎలిజా.

"నా మొహం లాగున్నది."

"అంత ఆకర్షణీయంగా వున్నదా? ఏ వస్తువయినా నీహృదయాన్ని అంతగా ఆకర్షించడము నే నోర్వలేను గోపీ!"

"ఎలిజా, నే నాంధ్రుడననీ, అవమానం సహించలేననీ...."

"సహించలేక యేమి చేస్తావు!" అని అడిగింది గోపీకి ఎదురుగా వచ్చి నిలబడి.

"ఏమిచేస్తానా! ఏమిచేస్తానా? ఇదిగో యిటు చూడు! కంఠమెత్తి, చేతులను చాచి ఏడుస్తాను."

"గోపీ, నా గోపీ!" అని ఎలిజా అతని తల తన భుజం మీద ఆనించుకొని, కేశములు సవరిస్తూ, తన సిల్కు చేతి రూమాలుతో కన్నీరు తుడుస్తూ, సముదాయించింది.